సాక్షి
నారాయణపేట

శుక్రవారం, 2, ఫిబ్రవరి, 2024



నల్లమలలో మంటలు

నల్లమల టైగర్ రిజర్వు ఫారెస్టు దోమలపెంట పరిధిలో మంటలు చెలరేగాయి.

వివరాలు IIలో ▸



మోసం చేసిందే కేసీఆర్

ప్రత్యేక రాష్ట్రంలో దళితులను మోసం చేసింది కేసీఆర్ అని వంశీచంద్‌రెడ్డి అన్నారు.

వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం
33.9 /14.7

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

5 నుంచి 'గావ్ చలో అభియాన్'

నారాయణపేట రూరల్: బీజేపీ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డ ఆధ్వర్యంలో చేపడుతున్న గావ్ చలో అభియాన్ విజయవంతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కే.రతంగపాండురెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల సంక్షేమం, మహిళా సాధికారికత, అంతర్గత, బాహ్య భద్రత, సాంస్కృతిక పునరుద్ధరణ, విదేశాల్లో భారతావని గౌరవాన్ని పెంపొందించడం వంటి కార్యక్రమాలపై ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. పదేళ్లపాటు ఎవరి ఊహకు అందని విధంగా పారదర్శక పాలనను అందించిన ఘనత మోదీదని అన్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల మద్దతు కూటగట్టి మరోసారి కమల వికాసానికి కృషి చేద్దామన్నారు. తెలంగాణలో ఈ నెల 5 నుంచి 8 వరకు జరిగే కార్యక్రమంలో ప్రతీ కార్యకర్త పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, రఘురామయ్యగౌడ్, మధన్, రవీందర్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

ఇనాం భూమి రిజిస్ట్రేషన్‌పై తహసీల్దార్ ఫిర్యాదు

దామరగిద్ద: ఇనాం భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి చేసిన విషయమై తహసీల్దార్ నాగజ్యోతి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 117,118 లో గల భూమిని ఓఆర్‌సీ ద్వారా అక్రమ పట్టా చేసుకున్న వ్యక్తి దుర్గాదేవికి విక్రయించారన్నారు. ఇట్టి భూమిని సదరు వ్యక్తి సరిత రాణికి విక్రహించేందుకు స్లాట్ బుక్ చేసుకున్న విషయమై సరైన రికార్డులు లేకపోవడంతో రిజిస్ట్రేషన్ నిలిపి వేశామన్నారు. విషయంతో దరఖాస్తు దారుతో పాటు వచ్చిన ముగ్గురు వ్యక్తులు తనతో వాగ్వాదానికి దిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐపీసీ సెక్షన్ 186, 189 మరియు 353 ప్రకారం కేసు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ వసంత తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వద్దు



నారాయణపేట రూరల్: శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ పడకూడదని ఎస్పీ యోగేష్‌గౌతమ్ అన్నారు. ఇటీవల బదిలీపై జిల్లాకు వచ్చిన పలువురు ఎస్ఐలు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాద పూర్వకంగా కలుసుకుని పూలమొక్కలను అందించారు. ఎస్పీ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో క్రైమ్ రేటును తగ్గించేందుకు కృషి చేయాలని, కాలనీలు, వ్యాపార సముదాయల దగ్గర సీసీ కెమరాలపై దృష్టి సారించాలని సూచించారు. బాలకార్మిక వ్య వస్థ నిర్మూలన, బాల్య వివాహాల కట్టడిపై అవగాహన కల్పించాలని, మహిళలు, బాలికల రక్షణపై చర్యలు తీసుకోవాలన్నారు. చట్ట విరుద్ధ కర్యకలాపాలు జరగకుండా జగ్రత్తలు తీసుకోవాలని, నిరంతరం పెట్రోలింగ్ చేయిస్తూ దొంగతనాలు జరగకుండా చూడాలన్నారు. వెంకటేశ్వర్లు, భాగ్యలక్ష్మి, రమేష్, వసంత పాల్గొన్నారు.

30పోలీస్ యాక్ట్ అమలు

జిల్లాలో ఈ నెల 29 వరకు 30, 30ఏ పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు చేపట్టరాదన్నారు. శాంతిభద్రతలకు విగాతం కల్గిస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు నష్టం కల్గించరాదన్నారు.

ఆశ..నిరాశ!

కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

- పాలమూరు-రంగారెడ్డికి దక్కని 'ప్రత్యేక' కేటాయింపులు
- ఊసే లేని నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్లు..
- ఆదాయపు పన్ను రాయితీ యథాతథం.. వేతన జీవులకు లభించని ఊరట
- ఆశ, అంగన్‌వాడీ, మహిళా హెల్పర్లకు 'ఆయుష్మాన్‌భవ'పై హర్షం
- పేద, మధ్యతరగతి వర్గాలు, రైతులకు పెద్దపీట



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

పార్లమెంట్‌లో గురువారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ జిల్లావాసులను నిరాశకు గురిచేసింది. దాదాపు అన్ని వర్గాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. పన్ను పరిమితి పెంచుతారని ఆశించిన వేతన జీవులకు భంగపాటే ఎదురుకావడంతో పాటు జిల్లాకు ప్రత్యేక ప్రయోజనం చేకూరేలా ఎలాంటి కేటాయింపులు లేవని కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికార బీజేపీ నేతలు మాత్రం పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు చేకూరేలా బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఊసేలేని 'పాలమూరు'..

ఉమ్మడి పాలమూరుతోపాటు రంగారెడ్డి జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదాపై బడ్జెట్‌లో ఊసే లేకుండాపోయింది. జాతీయ హోదా కుదరదని, అయితే నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని ఇటీవల తమను కలిసిన రాష్ట్ర మంత్రులకు కేంద్ర మంత్రులు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక కేటాయింపులు ఉంటాయని భావించారు. కానీ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయకపోవడంపై జిల్లా వాసుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

వేతన జీవుల ఆశలు అడియాసలే..

వ్యక్తిగత ఆదాయపు పన్ను రాయితీని రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు పెంచుతారని భావించారు. కానీ బడ్జెట్‌లో ఎటువంటి ప్రకటన లేదు. దీంతోపాటు పన్ను రేట్లు యథాతథంగా ఉండడంతో వేతన జీవులు నిరాశలో ఉన్నారు.

పేద, మధ్య తరగతికి ఊరట

అద్దె నివాసాలు, మురికి వాడల్లో ఉంటున్న వారికి ఇల్లు కట్టుకోవడానికి కొత్త పథకాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. అంతే కాదు ఇప్పటికే ఉన్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద వచ్చే ఐదేళ్లలో గ్రామీణ పేదలకు మరో 2 కోట్ల ఇళ్లను నిర్మించనున్నట్లు వివరించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో సుమారు 2 లక్షల మంది ఇల్లు లేని పేద, మధ్య తరగతి కుటుంబాలకు మేలు జరగనుంది. సామాన్య ప్రజలకు విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి కల్పించేలా కొత్త సోలార్ పథకాన్ని ప్రకటించారు. ప్రతి నెలా 300 యూనిట్లు ఉచిత విద్యుత్ పొందేలా కోటి గృహాలకు ఇళ్లపై సౌర ఫలకాల వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టనుండడంతో జిల్లాలో కనీసం 50వేల పేద కుటుంబాలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కేంద్ర విద్యాలయాలు సైతం..

నూతనంగా ఆవిర్భవించిన జిల్లాల్లో జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్ల ఏర్పాటుపై బడ్జెట్‌లో ప్రాధాన్యం కరువైంది. గతంలో దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో 750 ఏకలవ్య పాఠశాలలు, 100 సైనిక్ స్కూళ్ల ఏర్పాటుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. నారాయణపేట శివారు ఎక్లాస్‌పూర్‌లో 50 ఎకరాల స్థలాన్ని సైనిక్ స్కూల్‌కు కేటాయించారు. ఆ తర్వాత బడ్జెట్‌లోనైనా దీనికి అడుగులు పడుతాయని భావించినా.. నిరాశే ఎదురైంది. తాజా బడ్జెట్‌లో సైతం నిధులు కేటాయించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మహిళలకు ఆరోగ్య రక్షణ, జీవనోపాధి..

గ్రామాల్లోని రెండు కోట్ల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందించేందుకు లక్‌పతి దీదీ పథకాన్ని ప్రధాని మోదీ గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రకటించారు. మహిళలు సాధికారత, స్వావలంబన సాధించే దిశగా ఏటా లక్షకుపై ఆదాయం పొందేలా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మహిళల జీవనోపాధిలో భాగంగా ప్లంబింగ్, ఎల్ఈడీ బల్బుల తయారీ, డ్రోన్‌లను ఆపరేట్ చేయడం, మరమ్మతుల నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. అదేవిధంగా ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా హెల్పర్లకు ఆయుష్మాన్ భారత్ కింద ఆరోగ్య సంరక్షణ వర్తింప జేయనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. అదేవిధంగా 9 నుంచి 18 ఏళ్ల వయసు ఉన్న బాలికలు సర్వైకల్ కేన్సర్ బారిన పడకుండా చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో బాలికలు సుమారు 2.50 లక్షల మందికి ప్రయోజనం ఉంటుందని అంచనా.

రైతులకు పెద్దపీట..

పీఎం స్వనిధి ద్వారా మరో 2.3 లక్షల మందికి కొత్త రుణాలు ఇవ్వనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. నానో యూరియా తర్వాత నానో డీఏపీ కింద ఎరువులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 18 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుండగా.. సదరు రైతులకు ప్రయోజనం చేకూరనుంది. దీంతో పాటు పాడిరైతుల ప్రోత్సాహానికి ప్రత్యేక సమగ్ర కార్యక్రమం కింద ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కులు ఏర్పాటు చేయనుండడంతో రైతులకు మేలు చేకూరే అవకాశం ఉంది. కాగా, తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.5,071 కోట్ల ప్రకటించారు. రాష్ట్రంలో 100 శాతం విద్యుదీకరణ పూర్తయిందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అయితే ఈ బడ్జెట్‌లోనూ కృష్ణా-వికారాబాద్, గద్వాల-డోర్నకల్ లేన్‌కు మోక్షం లభించలేదు. కాగా మహబూబ్‌నగర్‌లోని టీడీగుట్ట వద్ద ఆర్‌ఓబీకి మాత్రం నిధులు కేటాయించారు.

ఉద్యోగులకు ప్రయోజనం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం చేకూరే విధంగా ఉంది. ముఖ్యంగా పన్ను పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచడం వల్ల ఉద్యోగులకు మేలు జరుగుతుంది. ఆవాస్ యోజన కింద 2 కోట్ల ఇళ్ల నిర్మాణం, ఆశ, అంగన్‌వాడీలకు ఆయుష్మాన్ భారత్ స్కీం ఇవ్వడం, ముఖ్యంగా సోలార్ రూఫ్ పాలసీతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రయోగాలకు ఊతం ఇచ్చే విధంగా బడ్జెట్ రూపొందించారు.

– గద్దం జిమ్మీకార్టర్, పీయూ ఎకానమిక్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ

క్షేత్రస్థాయిలో ఖర్చు చేయాలి..



పదేళ్లుగా లేని అభివృద్ధిని ఇప్పుడు చేస్తామంటూ కొన్ని అంశాలను బడ్జెట్‌లో పెడితే పేద, మధ్యతరగతి ప్రజలకు లాభం లేదు. రూ.47.66 లక్షల కోట్ల బడ్జెట్‌లో కేటాయింపులతోనే సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో ప్రజల అభివృద్ధి కోసం ఖర్చు చేయాలి. ఉపాధి హామీ పథకంలో బడ్జెట్‌ను మరింత పెంచితే కూలీలకు మేలు జరిగే అవకాశం ఉంది. మొత్తం మీద ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కొన్ని పథకాలను మాత్రమే ప్రకటించారు.

– కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే, కల్వకుర్తి

రాష్ట్రానికి అన్యాయం



రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన బడ్జెట్‌లా ఉంది. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులనే పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదు. ఈసారి కూడా బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగింది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఈ బడ్జెట్‌లోనూ మొండిచేయి చూపారు. జాతీయ హోదాను మరిచారు.

– జి.మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, దేవరకద్ర

నిరుత్సాహపర్చింది..



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌తో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదు. అన్నివర్గాలను నిరుత్సాహపర్చింది. దీంతో పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి మేలు జరగదు. కార్పొరేట్ సంస్థలకు మాత్రమే మేలు కలుగుతుంది. కొత్త కేటాయింపులు లేకపోవడం వల్ల రాష్ట్రం, జిల్లాకు ఎలాంటి లబ్ధి చేకూరలేదు. పెట్రో ధరల తగ్గింపుపై నిరాశే మిగిలింది.

– జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

బడా బాబులకు మేలు..



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కొత్తదనం ఏమీ లేదు. కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కొత్త సీసాలో పాత సారా పోసినట్లు ఉంది. పదేళ్లగా అధికారంలో ఉన్న బీజేపీ.. రైతులు, పేద, మధ్య తరగతి ప్రజలను పక్కనపెట్టి.. కేవలం బడాబాబులకు మేలు చేకూర్చేలా రూపొందించిది. ఇప్పుడు ఎన్నికలు ఉండటంతో బడ్జెట్‌లో పెద్ద పెద్ద అంకెలు మాత్రమే చూపెట్టారు. అవి అమలయ్యేవి కావు.

– బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, గద్వాల

కార్పొరేట్‌కు పెద్దపీట..



కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్ వ్యవస్థకు పెద్దపీట వేశారు. సామాన్యులకు న్యాయం జరిగే విధంగా బడ్జెట్ ఉండాలి. అన్ని రాష్ట్రాల్లోనూ విద్య, వైద్యం ఉచితంగా అందించాలి. ఆదివాసీల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి. కేంద్ర బడ్జెట్ అంకెల గారడిగానే ఉంది.

– వంశీకృష్ణ, ఎమ్మెల్యే, అచ్చంపేట

నన్ను గెలిపిస్తే ప్రజాసేవ చేస్తా..



మోమినాపూర్ మాట్లాడుతున్న డీకే అరుణ

కోస్గి (మద్దూరు): ముచ్చటగా మూడో సారి కేంద్రంలో మోదీ ఆధ్వర్యంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. గురువారం మద్దూరు మండలంలోని మోమినాపూర్, చెన్నారెడ్డిపల్లిలో బీజేపీ జెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆయలంలో పూజలు నిర్వహించిన అనంతరం జెండావిష్కరణ చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎంపీగా నన్ను గెలిపిస్తే ప్రజా సేవ చేస్తానని డీకే అరుణ అన్నారు. రాష్ట్రంలో మాయ మాటలు చెప్పి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభయహస్తం హామీలు అమలు కావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని సీఎం చెప్పడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పట్లో ఢిల్లీలో అధికారం చేపట్టేది లేదన్నారు. కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీజేపీ ప్రభుత్వమే, మళ్లీ మన ప్రధాని మోదీ అన్నారు. నేను ఈ ప్రాంతానికి చెందిన బిడ్డనే.. మా పుట్టినింటి కుటుంబం, అత్తింటి కుటుంబం చాలా సంవత్సరాలుగా ప్రజాసేవాకే అంకితమై ఉన్నామన్నారు. ప్రపంచం మెచ్చిన నాయకుడు మోదీ అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మదన్, బంటురమేష్, సత్యరఘుపాల్‌రెడ్డి, లలితమ్మ, భవాని, వెంకటప్ప, ఆంజనేయులు, చిరంజీవిరెడ్డి, సాయిలు, రమికుమార్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పెసర క్వింటా రూ.6,225

నారాయణపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం పెసర క్వింటా గరిష్టం, కనిష్టంగా రూ.6,225 ధర పలికింది. శనగలు గరిష్ట, కనిష్టంగా రూ.5,909, వేరుశనగ గరిష్టంగా రూ.7,069, కనిష్టంగా రూ.4,069, వడ్లు సోనా గరిష్ట, కనిష్టంగా రూ.2,069, తెల్ల కందులు గరిష్టంగా రూ.10,841, కనిష్టంగా రూ.10,410, ఎర్ర కందులు గరిష్టంగా రూ.10,850, కనిష్టంగా రూ.9,430 ధరలు పలికాయి.

గ్రామ పంచాయతీకి తాళం వేసి నిరసన



మాగనూర్: గ్రామ పంచాయతీ భవనం నిర్మించి ఏళ్లు గడుస్తున్నా తనకు మాత్రం బిల్లు ఇవ్వడం లేదంటూ నిరసనగా కాంట్రాక్టర్ పంచాయతీ భవనానికి తాళం వేశారు. ఆయన తెలిపిన వివరాలిలా.. మాగనూర్ గ్రామ పంచాయతీ భవనాన్ని కాంట్రాక్టర్ శ్రీనివాస్ ఆరేళ్ల క్రితం నిర్మించారు. అప్పటి, ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారని, నాటి నుంచి బిల్లు పెండింగ్‌లోనే ఉందన్నారు. ఈ విషయమై గతంలో కలెక్టర్, ఎంపీడీవోలకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. అయినా నేటి వరకు తమకు రావాల్సిన డబ్బులు రావడం లేదని, మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ సోషల్ ఆడిట్ జరుగుతుందని, ఇప్పటికైనా పంచాయతీ భవనం డబ్బులు ఇవ్వాలని అడగగా ఏఈని అడగాలని తెలిపారు. ఏఈని సంప్రదించగా మళ్లీ సోషల్ ఆడిట్ వారినే సంప్రదించాలని అంటూ కాలయాపన చేస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు రావాల్సిన డబ్బులు చెల్లించాలని అంతవరకు గ్రామపంచాయతీ భవనానికి తాళం వేయడం జరుగుతుందని అన్నారు. ఇదే విషయంపై ఎంపీవోకు వినతిపత్రం అందజేశారు.

గొర్రెల పంపిణీ చేపట్టాలి

నారాయణపేట: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గొల్ల కురుమలకు, యాదవులకు ఇచ్చిన మాట నిలబెట్టుకొని గొర్రెల పంపిణీని వెంటనే చేపట్టాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాము అన్నారు. జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎంఎల్ మాస్‌లైన్) పార్టీ జిల్లా కార్యాలయంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ఆఫీస్ బ్యానర్స్ సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డీడీలు చెల్లించి ప్రతి గొర్రెల కాపరులకు, గొల్లకురుమలకు యాదవులకు గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి పంపిణీ చేయాలని ఫిబ్రవరి 7న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకంలో దాదాపు 9 నెలల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు అప్పులు చేసి డీడీలు చెల్లించారు. ఒక్క నారాయణపేట జిల్లాలో 7,186 మంది డీడీలు చెల్లించారని అందులో గత ప్రభుత్వం 1276 మందికి గొర్రెలను అందజేశారు. యాదగిరి, చెన్నారెడ్డి, కొండనర్సింహులు, నారాయణ పాల్గొన్నారు.

పన్ను బకాయిలు వసూలు చేయాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్

నారాయణపేట: జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో అన్ని రకాల పన్నుల బకాయిలను వసూలు చేయాలని అడిషనల్ కలెక్టర మయాంక్ మిట్టల్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన మున్సిపల్ కమిషనర్లు, మేనేజర్, ఇంజినీర్, అకౌంటెంట్ల సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆస్తి పన్నులను మార్చి నెల ఖరులోగా వసూలు చేయాలన్నారు. మున్సిపాలిటీల వారీగా ఆస్తి పన్ను లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్తి పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, మున్సిపల్ దుకాణ సముదాయాల అద్దె బకాయిలను వెంటనే వసూలు చేయాలన్నారు. ప్రధానంగా పారిశుద్ధ్య నిర్వహణపై కమిషనర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కాల్వల్లో మురుగు నిల్వకుండా శుభ్రం చేయించాని, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న ప్రగతి పనులపై ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి నిర్మాణ పనులను వేగిరం చేయాలన్నారు. కొత్తగా చేపట్టే పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఇంజనీర్లను సూచించారు. నారాయణపేట మున్సిపల్ కమిషనర్ సునీత, ఇంజనీర్ మహేశ్, ఇంచార్జి మేనేజర్ మహ్మద్ యూసుఫ్, ఆర్ఐ అజీమ్, మక్తల్, కొస్గి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

11 మంది ఎస్ఐల బదిలీ

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో వివిధ చోట్ల పనిచేస్తున్న ఎస్ఐలను బదిలీ చేస్తూ జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో ఇటీ వల మూడు దఫాల్లో ఎస్ఐల బదిలీలు కాగా.. తాజాగా మ రో 11 మందికి స్థాన చలనం కల్పించారు.

ఎస్ఐ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్.అభిషేక్‌రెడ్డి	వీఆర్, వనపర్తి	నవాబ్‌పేట
పి.అశోక్‌బాబు	వీఆర్, మహబూబ్‌నగర్	ఎస్ఐ-2, జడ్చర్ల టౌన్
కె.తిరుపాజీ	సీసీఎస్, మహబూబ్‌నగర్	బాలానగర్
కె.శ్రీనివాస్	బాలానగర్	సీసీఎస్, మహబూబ్‌నగర్
పి.వీరబాబు	వీఆర్, నాగర్‌కర్నూల్	ఊర్కొండ
కె.రవి	వీఆర్, మహబూబ్‌నగర్	రాజాపూర్
డి.లెనిన్	ఊర్కొండ	వీఆర్, నాగర్‌కర్నూల్
జి.వెంకట్‌రెడ్డి	రాజాపూర్	వీఆర్, మహబూబ్‌నగర్
ఎ.విజయ్‌కుమార్	డీఎస్‌బీ, మహబూబ్‌నగర్	ధరూర్
గోవర్ధన్	నారాయణపేట రూరల్	నాగర్‌కర్నూల్ టౌన్
నాగశేఖర్‌రెడ్డి	సీసీఎస్ గద్వాల	బిజినేపల్లి

కొలువుదీరేనా..?

- పదేళ్లుగా నీటి సంఘాల ఎన్నికల మాటే కరువు
- చెరువులు, కుంటలపై కొరవడిన పర్యవేక్షణ.. పలు చోట్ల ఆక్రమణ
- కొత్త ప్రభుత్వంలో అయినా ఎన్నికలు జరిగేనా ?



కోస్గి మండలంలోని దండం చెరువు

కోస్గి: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం చెరువుల అభివృద్ధికిగాను మిషన్ కాకతీయ పథకం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అయితే చెరువుల అభివృద్ధి, వాటి నిర్వహణ, ఆయకట్టుకు నీటిని సరఫరా చేయడం, పర్యవేక్షణ లాంటి పనులను నీటి సంఘాల పాలకవర్గాలు ఒకప్పుడు పని చేసేవి. కానీ గతంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం పదేళ్లగా నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రస్తుతం చెరువుల పర్యవేక్షణ కరువైంది. మిషన్ కాకతీయలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చెరువులను, కుంటలను పునరుద్ధరించింది. కానీ నీటి సంఘాలకు పాలకవర్గాలు లేకపోవడంతో పనుల నాణ్యత గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేశారు. చెరువులు ఆక్రమణకు గురైనా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికే జిల్లాలో చాలా చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని ప్రజలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా, కోస్గి మండలంలో 26 గ్రామ పంచాయతీల్లో 13 నోటిఫైడ్ చెరువులు, 125 చెరువులు, కుంటలున్నాయి. ఇందులో కొన్ని కుంటల్ని మినహాయించి మొత్తం చెరువులను మూడు విడతల్లో ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కింద అభివృద్ధి పనులు చేశారు. వీటిలో వంద ఎకరాలకు పైగా ఉన్న చెరువులకు నీటి సంఘాలు ఉండేవి.

గతంలో సంఘాలు ఇలా..

ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగానే చెరువులు, కుంటల కింద ఉన్న ఆయకట్టు రైతులు చెరువుకు చైర్మన్‌తో పాటు డైరెక్టర్లను ఎన్నుకునేవారు. ఈ పాలకవర్గం సభ్యులు చెరువుల నిర్వహణతో పాటుగా నీటిని పంట పొలాలకు విడుదల చేసుకుని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసుకునేవారు. అంతేకాకుండా రైతులను సమన్వయ పర్చుకుంటూ అభివృద్ధి పనులు చేసేవారు.

2008 నుంచి ఎన్నికలు బంద్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2006 సంవత్సరంలో సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీకాలం 2008తో ముగిసింది. అప్పటి నుంచి తిరిగి ఎన్నికలు జరగలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నీటి సంఘాల ఎన్నికల మాట ఊసెత్తనే లేదు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైన నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి చెరువులను మరింత అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

సంఘాలతో చెరువులు అభివృద్ధి



గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంలో చెరువుల్ని అభివృద్ధి చేసింది. చెరువు నీటి సంఘాలకు ఎలాంటి ఎన్నికలు నిర్వహించలేదు. గతంలో ఉన్న మాదిరిగా చెరువులకు నీటి తీరువా సంఘాలు ఏర్పాటు చేస్తే చెరువులు మరింత అభివృద్ధి చెందుతాయి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు తీసుకొని చెరువు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి.

– వెంకటయ్య, దండం చెరువు సంఘం మాజీ ఉపాధ్యక్షుడు

క్రీడలతో మానసిక ఉల్లాసం



మాట్లాడుతున్న సీఐ రవిబాబు

నారాయణపేట రూరల్: చిన్నాతనం నుంచి క్రీడలకు ప్రాధాన్యత ఇస్తే తప్పకుండా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చని సీఐ రవిబాబు అన్నారు. సింగారం చౌరస్తాలోని టీఎస్‌డబ్ల్యూఎస్ పాఠశాల మైదానంలో గురువారం ఉమ్మడి జిల్లా బాల, బాలికల ఖోఖో పోటీలను నిర్వహించి రాష్ట్ర స్థాయి జట్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆటలతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. క్రీడాపోటీల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నం, రిటైర్డ్ పీఈటీలు గోపాలం, నర్సింహులు ఖోఖో సంఘం అధ్యక్షులు బాలరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, బాలరాజు, వెంకటప్ప, సాయినాథ్, సౌమ్య, కృష్ణవేణి, రూపా పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు



పార్లమెంట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తవుతున్నాయి. పీఎం ఆవాస్ యోజన, రూఫ్ టాప్ సోలారైజేషన్ స్కీం కింద 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం తదితర అంశాలపై హర్షం వ్యక్తమైంది. మరోవైపు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అంకెల గారడీ బడ్జెట్ ప్రవేశపెట్టారని మరికొందరు అభిప్రాయపడ్డారు. పెట్రో ధరలు తగ్గుతాయని ఆశించగా.. నిరుత్సాహం కలిగిందని పేర్కొన్నారు. బడ్జెట్‌తో పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి లాభం లేదని తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్

ప్రజారంజక బడ్జెట్..



కేంద్ర బడ్జెట్ గ్రామీణ భారతావనిని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు దోహదపడుతుంది. ప్రధానంగా పేదల ఆవాసం, విద్యుత్ పథకాలతో పాటు వ్యవసాయం, పాడిపరిశ్రమను పెద్దఎత్తున ప్రోత్సహించేందుకు రాయితీతో కూడిన రుణసదుపాయం కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం అందించింది. ఇది పూర్తిగా ప్రజారంజకమైన బడ్జెట్.
– డీకే అరుణ, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు

జీడీపీ పెరిగింది..



కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశ జీడీపీ 4.5 శాతం ఉంటే.. బీజేపీ వచ్చిన తర్వాత క్రమంగా పెరుగుతూ 7.05 శాతానికి చేరింది. జీడీపీ పెరిగితేనే దేశం అభివృద్ధి సాధ్యమవుతుంది. ఇక దేశ ఆర్థిక మూలాలు కూడా బాగుపడ్డాయి. ఈసారి ప్రభుత్వం తీసుకొచ్చిన బడ్జెట్ మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేస్తోంది. హౌసింగ్ విధానం వల్ల ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరుతుంది.
– ఏపీ జితేందర్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు, మహబూబ్‌నగర్

మాట తప్పిన కేంద్రం..



ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడటంలో కేంద్రం విఫలమైంది. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నట్లుగా ఆదాయ పన్ను పరిమితి పెంచకుండా ఉద్యోగులను ఆర్థికంగా కుదేలుచేసింది. స్టాండర్డ్ డిడక్షన్ కేవలం రూ.2,500 పెంచడం వల్ల ఉద్యోగులకు ఒరిగే ప్రయోజనం శూన్యం. మరోమారు ఉద్యోగులకు నిరాశ మిగిల్చిన ఘనతను కేంద్రం మూటకట్టుకుంది. – షేక్ ఫారుఖ్ హుస్సేన్, మహబూబ్‌నగర్

సొంతింటి కల సాకారం..



పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు పీఎం ఆవాస్ యోజన కింద రాబోయే ఐదేళ్లలో 2 కోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు బడ్జెట్ కేటాయించడం సంతోషంగా ఉంది. రూఫ్ టాప్ సోలారైజేషన్ స్కీం కింద దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం శుభసూచికం. – బజారన్న మానవపాడు

రైతులకు మరోసారి నిరాశ..



కేంద్ర ప్రభుత్వం మరో సారి రైతులను నిరాశ పరిచింది. పంట సహాయాన్ని మరింత పెంచుతుందని భావించాం. ఆవేవీ లేకుండా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించడం తగదు. పేరుకు మాత్రమే రూ.1,27 వేల కోట్లను బడ్జెట్ లెక్కల్లో చూయించారు. -సుధాకర్‌నాయుడు, రైతు సంఘం నాయకుడు, చిన్నంబావి

గారడీ విద్య ప్రదర్శన..



పార్లమెంట్ ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం గారడీ విద్య ప్రదర్శిస్తోంది. నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు ఉపయోగడే పథకాలకు నిధుల కేటాయింపులు సక్రమంగా జరగలేదు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమానికి కేటాయించిన నిధులే ఇందుకు నిదర్శనం. విద్య, వైద్యానికి కూడా బడ్జెట్‌లో సరైన ప్రాధాన్యం ఇవ్వలేదు. పెట్టుబడీదారులకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టంగా కనబడుతోంది.
– ఫయాజ్, సీపీఐ రాష్ట్ర నాయకుడు, అలంపూర్

సంతోషంగా ఉంది..



ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో అంగన్‌వాడీలను చేర్చడం సంతోషంగా ఉంది. కరోనా కాలంలో ప్రజలకు ముందుండి సేవలు అందించిన తమను కేంద్ర ప్రభుత్వం గుర్తించి, ఆయుష్మాన్ భారత్‌లో చేర్చడం శుభపరిణామం. అయితే పరిస్థితుల మేరకు పరిమితి పెంచాలి. అన్ని ప్రాంతాల్లో తమకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి.
– ప్రమీల, అంగన్‌వాడీ టీచర్, నవాబుపేట

తెలంగాణకు అన్యాయం..



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వలేదు. ట్యాక్స్ వ్యవహారంలో కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేశారు. మాచర్ల–గద్వాల రైల్వేలైన్‌కు ఈ సారి కూడా అన్యాయం చేశారు. వ్యవసాయం రంగానికి, గిట్టుబాటు ధరలకు నిధుల కేటాయింపులు సరిగ్గా జరగలేదు. విద్యారంగానికి 10 శాతం నిధులు కేటాయించాల్సి ఉంది. గ్రామీణాభివృద్ధి, వైద్యరంగానికి సరిపడా నిధులు కేటాయించలేదు. తెలంగాణ ప్రాజెక్టులు, ఐటీఐలు, మెడికల్ ఎడ్యుకేషన్‌కు నిరాశే మిగిలింది. – అంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి, జోగుళాంబ గద్వాల

సోలార్ ఏర్పాటు హర్షణీయం..



300 యూనిట్ల విద్యుత్ వినియోగించే వారి ఇంటిపై సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్రం ముందుకురావడం హర్షణీయం. దీనిపై రాయితీ ఎంత ఇస్తారనే విషయాన్ని తెలియజేయాలి. పన్ను విధింపు విషయంలోనూ ఉద్యోగుల్లో అసంతృప్తి ఉంది. పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించేలా నిర్ణయాలు తీసుకుని ఉంటే బాగుండేది.
– మధుసూదన్‌గౌడ్, తపస్ మండల అధ్యక్షుడు, జడ్చర్ల

నిరుత్సాహ పరిచింది..



కేంద్ర బడ్జెట్ అందరినీ నిరుత్సాహపర్చింది. రాబోయే రోజుల్లో కేంద్రం అనుసరించే విధి విధానాలను బహిర్గత పర్చినట్లయ్యింది. పెట్రో ధరలు తగ్గించే దిశగా చర్యలు తీసుకోకపోవడం తగదు. ఈ బడ్జెట్‌తో పేద, మధ్యతరగతి వర్గాలకు నిరాశే మిగిల్చిందని చెప్పవచ్చు.
– సునీత, గృహిణి, బాదేపల్లి

కొత్త సీసలో పాత సారలా ఉంది..



ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కొత్త సీసాలో పాత సారాలా ఉంది. యువత, మహిళలు, పేదలు, రైతులే ప్రాధాన్యమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. ఆ వర్గాలకే ఏమాత్రం న్యాయం చేయలేదు. కేంద్ర విధానాలతో పేదలకు ఎలాంటి లబ్ధి చేకూరడం లేదు. రైతుల ఆదాయం తగ్గిపోతోంది. మహిళలకు రక్షణ కరువైంది. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల హామీ నెటికీ నెరవేరలేదు.
– చిన్నారెడ్డి, మాజీ మంత్రి, వనపర్తి

కార్మికుల సంక్షేమాన్ని విస్మరించింది..



కేంద్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని విస్మరించింది. నల్లచట్టాలతో కార్మిక లోకానికి కష్టాలను తీసుకొచ్చిన కేంద్రం.. వాటిని పూర్తి స్థాయిలో రద్దుపరిచి, కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి. వృద్ధాప్యంలో పెన్షన్ వసతి కల్పించాలి. ప్రమాదంలో మృతిచెందే కార్మికులకు చెల్లించే పరిహారం రూ.20 లక్షలకు పెంచాలి. – విజయరాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి, వనపర్తి

అన్ని వర్గాలకు సముచిత స్థానం..



బడ్జెట్‌లో అన్ని రంగాలు, వర్గాలకు సమచిత స్థానం కల్పించారు. ఆయుష్మాన్ భారత్, ఉపాధి హామీ, రైతుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా నిధుల కేటాయింపు చేశారు. ప్రధానంగా సోలార్ పవర్ ప్రాజెక్టులో 3వేల కుటుంబాలకు సబ్సిడీలు ఇవ్వడం ఉపయోగకరం. ఇక ఆదాయపన్ను రూ.5లక్షల నుంచి రూ.7లక్షలకు మినహాయింపు చేయడం మధ్యతరగతి వారికి మేలు చేకూరుతుంది. – పి.శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

రోడ్డు, ప్రాజెక్టులకు ప్రాధాన్యం..



కేంద్ర ప్రభుత్వం రూరల్ ఇండియా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు రోడ్లు, ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చింది. మహిళలు, యువకులు, రైతులను ప్రోత్సహించే విధంగా బడ్జెట్ ఉంది. రాబోయే కాలంలో దేశ ప్రగతిని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ కేటాయింపులు జరిగాయి.
– శాంతకుమార్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి, మహబూబ్‌నగర్

గ్రామాల అభివృద్ధికి దోహదం..



బడ్జెట్‌లో గ్రామీణ భారతం అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడానికి ప్రాధాన్యం ఇచ్చారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా 2 కోట్ల మందికి గృహవసతి, రైతులకు రుణ సదుపాయం కల్పిస్తుంది. పరిశ్రమల ఏర్పాటు, యువతకు శిక్షణ, జాతీయ రహదారులు, కొత్త రైల్వేలైన్ల ఏర్పాటుకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు.
– బల్గెర శివారెడ్డి, బీజేపీ నాయకుడు, గద్వాల

విద్యకు మరిన్ని నిధులు కేటాయించాలి..



కేంద్ర ప్రభుత్వం విద్యకు అరకొర నిదులు కేటాయిస్తూ వస్తుంది. జీడీపీలో కనీసం 20 శాతం నిధులను కేటాయిస్తే అన్ని వర్గాలు చదువుకునేందుకు అవకాశం ఉంటుంది. యూనివర్సిటీలు, కళాశాలలు, పాఠశాలల్లో వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నవోదయ గురుకులాలు, కేంద్ర విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేయాలి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.
– భరత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

అదృశ్యమైన వ్యక్తి మృతి



చిన్ననాగయ్య (ఫైల్)

గోపాల్‌పేట: అదృశ్యమైన మృతిచెందిన ఘటన రేవల్లి మండలం గాంధీనగర్‌లో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ శివకుమార్ వివరాల ప్రకారం మండలంలోని గాంధీనగర్‌కు చెందిన చిన్ననాగయ్య (48) గత డిసెంబర్ 31న ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో జనవరి 2వ తేదీన బాధిత కుటుంబసభ్యులు రేవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏదుల, గాంధీనగర్ గ్రామాల మధ్య ఉన్న గట్లపై చిన్ననాగయ్య కుమారుడికి తండ్రి చెప్పులు, గొంగడి కనిపించాయి. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి వెళ్లగా సమీపంలో చెట్టుకు అస్థిపంజరం, పంచె వేలాడుతునట్లు గుర్తించాం. అదృశ్యమైన రోజు ఉరేసుకునట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఘటన స్థలంలోనే మృతదేహానికి వైద్యుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు.

మహిళపై గొడ్డలితో దాడి



దాడిలో గాయపడిన మైబూసమ్మ

పాన్‌గల్: ఇంటి ముందు మురుగు విషయంలో మహిళపై గొడ్డలితో దాడి చేసిన ఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వేణు వివరాల ప్రకారం.. మండలంలోని కేతేపల్లిలో నౌసాల్ల శేఖర్, గాలిగళ్ల మైబూసమ్మకు ఇంటి ముందు పారే మురుగు నీటి విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం మురుగు నీరు పారే విషయంపై ఘర్షణ చోటు చేసుకుంది. నౌసాల్ల శేఖర్ గొడ్డలితో మైబూసమ్మ తలపై దాడి చేసి గాయపర్చాడు. ఈ దాడిలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. గొడవను అడ్డుకో బోయిన ఆమె భర్త మునిస్వామిపై గొడ్డలితో దాడిచేయగా చేతికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మునిస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నౌసాల్ల శేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

నవాబుపేట: కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న మహిళ గురువారం ఆస్పత్రిలో మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌బాబు వివరాల ప్రకారం.. మండలంలోని జంగమయ్యపల్లికి చెందిన సూరమ్మ(54) గత నెల 19న ఇంట్లో వంట చేస్తుండగా చీరకు నిప్పంటుకుని శరీరం సగం కాలింది. దీంతో బంధువులు చుట్టు పక్కల వారు ఆమెను చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఆమెను హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆమె గురువారం మృతి చెందింది. ఆమె కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఎద్దులు దాడి చేసిన ఘటనలో వ్యక్తి..

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ అశోక్ బాబు కథనం మేరకు.. ఎర్రవల్లి మండలంలోని కొండపేటకు చెందిన మండ్ల నాగేష్ (70) గత నెల 30వ తేదీన ఇంటి దగ్గర ఎద్దులకు మేత వేయడానికి వెళ్లాడు. రెండు ఎద్దులు పోట్లాడుతూ ఒక్కసారిగా అతనిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అతని కుమారుడు మండ్ల బీచుపల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెత్తకాగితాలు ఏరుకునే వ్యక్తి హత్య

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో చెత్త కాగితాలు ఏరుకుని బతికే ఓ వ్యక్తి తలపై బండరాళ్లతో మోది హత్య చేసిన సంఘటన చొటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కోయిల్‌కొండ మండల కేంద్రానికి చెందిన రాగి మహేశ్(39) కొంత కాలంగా దేవరకద్రలో చెత్త కాగితాలు ఏరుకుని వాటిని అమ్ముకుని జీవించేవాడు. ఇదే క్రమంలో నవాబ్‌పేటకు చెందిన అలివేల, ఆమె కుమారుడు నర్సింహులు కూడా దేవరకద్రలో చెత్తకాగితాలు ఏరుకుని జీవించే వారు. మహేశ్‌తో వారికి స్నేహం ఏర్పడింది. దీంతో ముగ్గురు కలిసి రోజంతా చెత్త కాగితాలు ఏరుకుని వాటిని అమ్మి మద్యం తాగేవారు. అక్కడక్కడ అడుక్కుని తినే వారు. అయితే రాత్రి వేళ వారంతా మార్కెట్ యార్డులో నిద్రిస్తుండే వారు. అయితే బుధవారం రాత్రి మహేశ్ హత్యకు గురికావడంతో సమాచారం అందిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మహేశ్‌తో కలిసి ఉండే వారే తాగిన మత్తులో గొడవ పడి హత్య చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటన స్థలానికి ఎస్ఐ వెంకటేశ్ చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ సంఘటనకు సంబంధం ఉందనే అనుమానంతో కొందరిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నల్లమల టైగర్‌రిజర్వు ఫారెస్టులో మంటలు



నల్లమల అడవిలో చెలరేగిన మంటలను ఆర్పుతున్న సిబ్బంది

అమ్రాబాద్: నల్లమల టైగర్‌రిజర్వు ఫారెస్టులో దోమలపెంట రేంజ్ పరిధిలో మంటలు చెలరేగాయి. అధికారులు, సిబ్బంది మంటలు ఆర్పివేశారు. యాభై హెక్టార్లలో అడవి కాలిందని బయట ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ సంఘటనకు సంబంధించి దోమలపెంట ఫారెస్టు రేంజర్ గురుప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం బోర్రెడ్డిపల్లి బావి సమీపంలో రెండు హెక్టార్లు, అంతకు ముందు పల్లెబైలు, కొమ్మెనపెంట సమీపంలో ఐదు హెక్టార్లలో మంటలు వ్యాపించాయని చెప్పారు. సిబ్బంది, అధికారులు సమన్వయంతో మంటలను ఆర్పివేశామని చెప్పారు. మొత్తం ఏడు హెక్టార్లలో అడవి కాలిందని వివరించారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని అడవిలో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు.

'ఖిల్లా' లో చిరుత కలకలం



మేక మాంసాన్ని తింటున్న చిరుత పులి

మేకను ఎత్తుకెళ్లి తింటున్న దృశ్యాన్ని వీడియో తీసిన కాపరి

ఖిల్లాఘనపురం: వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురంలో చిరుత మేకను ఎత్తుకెళ్లి చంపితిన్న ఘటన గురువారం చోటు చేసుకుంది. ఈ దృశ్యాన్ని మేకల కాపరి వీడియో తీయడం సంచలనంగా మారింది. ఖిల్లాఘనపురం చెందిన కాగితాల నాగేష్ మేకలను అతని దగ్గర జీతం ఉన్న రాజు మరో ఇద్దరు మేకల కాపరులతో కలిసి గురువారం గ్రామ శివారులోని ఎర్రకుంటలో మేతకు తీసుకెళ్లారు. గుట్ట దగ్గరగా ఉండటంతో చిరుతపులి పొదల చాటున వచ్చి హఠాత్తుగా ఓ మేకను ఎత్తుకెళ్లింది. గుట్టల్లోకి తీసుకెళ్లి చంపి తినింది. అక్కడే ఉన్న కాపరులు గమనించి పారిపోయారు. కొంత సేపటికి కొందరు గ్రామస్తులతో కలిసి కేకలు వేస్తూ ఆ ప్రాంతంలో వెతికారు. గుట్టకు ఓ దగ్గర మేకను చంపికొంత భాగాన్ని తిన్న కళేభరం కనిపించింది. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారులు తెలుపడంతో రేంజ్ అధికారి భాస్కరాచారి, సిబ్బంది ఆంజనేయులుతో కలిసి అక్కడికి వచ్చి పరిశీలించి వెళ్లారు. సాయంత్రం సమయంలో కాపరి చనిపోయిన మేక ఉందో చిరుత తిన్నదో చూద్దామని వెళ్లాడు. చిరుత మరోసారి మేక దగ్గరకు వచ్చి మాంసం తింటూ కనిపించింది. ధైర్యం చేసిన కాపరి కొంత సేపు వీడియో తీశాడు. ఇన్ని రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో లేగదూడలను, గొర్రెలు, మేకలు తింటున్నప్పటికి చిరుత ఎవరికీ పూర్తి స్థాయిలో కనిపించకపోవడంతో ఫారెస్టు అధికారులు నిర్ధారించుకోవడానికి వీలు లేకుండా పోయింది. ప్రస్తుతం తీసిని వీడియో లో చిరుత పులి స్పష్టంగా కనిపించడంతో మండల ప్రజలు భయపడుతున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



తిరుపతయ్య(ఫైల్)

బల్మూర్: విద్యుదాఘాతంతో గ్రామ పంచాయతీ వర్కర్ మృతి చెందిన ఘటన గురువారం రాత్రి బల్మూర్ మండలంలోని తుమ్మెన్‌పేటలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మద్దెలగండ్ల తిరుపతయ్య(53) తన ఇంటి ఆవరణలోని ఆవుల షెడ్‌లో పాలు పితికేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆవులకు దోమలు రాకుండా ఫ్యాన్ ఏర్పాటు చేసేందుకు తీసుకొచ్చాడు. కరెంట్ ఆన్‌చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన గ్రామ పంచాయతీలో వర్కర్‌గా పని చేస్తున్నట్లు తాజామాజీ సర్పంచ్ తిరుపతిరావు తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య అలివేల ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వివాహిత బలవన్మరణం

నారాయణపేట: ఉరేసుకుని మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన గురువారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వసంత తెలిపిన వివరాల ప్రకారం దామరగిద్దకు చెందిన అనిత (28) బుధవారం రాత్రి ఉరేసుకుంది. ఐదేళ్ల క్రిత్రం మద్దూర్ మండలం దోరెపల్లికి చెందిన అనితను దామరగిద్దకు చెందిన మోహన్‌కు ఇచ్చి వివాహం చేశారు. కాగా అనితతో భర్త మోహన్ తరుచూ గొడవ పడేవాడని మృతురాలి తల్లి అనంతమ్మ ఫిర్యాదు చేశారన్నారు. తన కూతురు భర్త దెబ్బలకే చనిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు భర్త మోహన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఎంపీ బరిలో ఉన్నా : మల్లు రవి



అచ్చంపేటలో మాట్లాడుతున్న మల్లురవి

అచ్చంపేట: కాంగ్రెస్ పార్టీ తరఫున నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల బరిలో తాను ఉంటున్నానని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి మల్లు రవి అన్నారు. గురువారం అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ స్వగృహంలో ఆయనతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నాపై నమ్మకం ఉంచి సీఎం రేవంత్‌రెడ్డి అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించారని చెప్పారు. పార్లమెంట్ పరిధిలోని ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు తమకు ఉందని, వారందరూ నా అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నారని చెప్పారు. నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగిన నాకు ఎంపీగా పోటీ చేసే అవకాశం అధిష్టానం కల్పిస్తుందనే నమ్మకం ఉందన్నారు. ఇప్పటికే తాను ఎంపీకి పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నానని చెప్పారు. ఈ విషయం సీఎం దృష్టికి తీసికెళ్లగా.. సానుకూలంగా స్పందించారన్నారు. అధిష్టానం ప్రకారం జిల్లా ఎమ్మెల్యేలు పనిచేస్తారని, మా గెలుపునకు సహకరించిన మల్లురవికి ఎంపీ స్థానానికి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేలందరం కలిసి లెటర్ ఇచ్చామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ తెలియజేశారు. గెలిచే అవకాశం ఉన్న నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి బలమైన అభ్యర్థి మల్లు రవికి అవకాశం దక్కుతుందని ఆశిస్తున్నామన్నారు. కష్టపడి పనిచేసే తత్వం ఉన్న వ్యక్తికి టికెట్ ఇవ్వాలని కోరుకుంటున్నామని చెప్పారు.

తల్లిని హతమార్చిన కొడుకు

- ప్లాట్‌ను విక్రయించేందుకు భార్యకు సపోర్ట్ చేస్తుందనే దురాఘతం
- వనపర్తి జిల్లాలో దారుణ ఘటన



చిన్నమ్మ (ఫైల్)

కొత్తకోట రూరల్: వృద్ధాప్యంలో ఉన్న తల్లికి అండగా ఉండాల్సిన కన్న కొడుకే కాలయముడయ్యాడు. ప్లాట్ విక్రయించే క్రమంలో తల్లి, కొడుకుకు మధ్య గొడవ కారణంగా కోపోద్రిక్తుడైన కొడుకు తల్లిని ఈల పీట(కూరగాయలు కోసే కత్తి పీట)తో గొంతు కోసి దారుణంగా హత్యచేశాడు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం బండకాడితండాలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి తండవాసులు, చిన్న కుమారుడు సురేష్‌నాయక్ కథనం ప్రకారం.. మండలంలోని అమ్మపల్లి పంచాయతీ అనుబంధ బండకాడితండాకు చెందిన చిన్నమ్మ(50)కు ఇద్దరు కుమారులు రాజునాయక్, సురేష్‌నాయక్ ఉన్నారు. ఇద్దరికి పెళ్లిళ్లు కాగా.. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. రాజునాయక్ హైదరాబాద్ ఈసీఐఎల్‌లోని దమ్మాయిగూడలో భార్య, పిల్లలతో ఉంటూ ఆటోడ్రైవర్‌గా నడుపుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్నేళ్ల క్రితం రాజునాయక్ దమ్మాయిగూడలో ఓ ప్లాట్ (ఇంటికోసం స్థలం)ను కొనుగోలు చేశాడు. ప్రస్తుతం ప్లాట్ అమ్మి వేరే దగ్గర కొనుగోలు చేయాలని భార్య తరచుగా రమేష్ నాయక్‌తో గొడవ పడుతోంది. ఇందుకు రమేష్ తల్లి చిన్నమ్మ వత్తాసు పలుకుతోంది. ఈ క్రమంలో రమేష్ కుటుంబంతో కలిసి శనివారం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి రాగా.. గొడవలు మరింత పెద్దవయ్యాయి. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి, గురువారం ఉదయం తల్లి, కొడుకుకు ప్లాట్ గొడవ మళ్లీ మొదలైంది. దీంతో కోపోద్రిక్తుడైన రాజునాయక్ ఇంట్లో కూరగాయలు కోసే ఈలపీటతో తల్లి గొంతుకోశాడు. ఆమె అరుపులు విన్న చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చి.. కొన ఊపిరితో ఉన్న చిన్నమ్మను వనపర్తి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సీఐ కేఎస్ రత్నం, ఎస్ఐ హరిప్రసాద్ సిబ్బందితో వచ్చి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై చిన్నమ్మ చిన్న కుమారుడు సురేష్‌నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దళితులను మోసం చేసిందే కేసీఆర్



ఊట్కూరులో పాదయాత్ర చేస్తున్న వంశీచందర్‌రెడ్డి, నాయకులు

సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి

ఊట్కూరు/మక్తల్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక దళితులను కేసీఆర్ మోసం చేశారని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఊట్కూర్ మండలంలో, మక్తల్‌లో రెండవ రోజు పాలమూరు న్యాయ పాదయాత్ర చేపట్టారు. పెద్దజట్రం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి పాదయాత్ర కొనసాగించారు. బిజ్వార్‌లో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అవుసలోనిపల్లి, పులిమామిడి వరకు పాదయాత్రను కొనసాగించారు. మక్తల్ మండలం కర్ని, ఖానాపూర్ మక్తల్‌లో రాత్రి 9 గంటలకు పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ముందుగా దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, దళితులకు మూడెకరాల భూమిని కేటాయిస్తానని కేసీఆర్ హామీ ఇచ్చి దగా చేశారన్నారు. రాష్ట్రంలో ముదిరాజులు అత్యధికంగా ఉన్నా బీఆర్ఎస్ తరుపున ఒక్క ఎమ్మెల్యే సీటును కూడా అభ్యర్థిని నిలబెట్టలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో రెండు అమలు చేసిందన్నారు. ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పింఛన్లు కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో చేపడుతుందని పేర్కొన్నారు. దళితులకు దళితబంధు పథకంలో ఇంటికి రూ.10 లక్షలు ఇస్తానని బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో ముదిరాజుల తరుపున ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఒక్కరే ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో చేపట్టడం వల్ల రెండు రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, అలాగే మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాలలో ఎమ్మెల్యేలు గెలిచారన్నారు. రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడైన వంశీచంద్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపిస్తే మన నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, పటేల్ చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజుగౌడ్, అబ్దుల్ ఖాదర్, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఫెరారీకి హామిల్టన్!

ఏడుసార్లు ఫార్ములావన్ వరల్డ్ చాంపియన్, బ్రిటన్ దిగ్గజ రేసర్ లూయిస్ హామిల్టన్ మెర్సిడెస్ జట్టును వీడనున్నాడు. 2013 నుంచి మెర్సిడెస్ తరఫున పోటీపడ్డ హామిల్టన్ ఈ ఏడాది తర్వాత ఆ జట్టుతో బంధం తెంచుకోనున్నాడు. 39 ఏళ్ల హామిల్టన్ 2025 సీజన్‌లో ఫెరారీ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం దాదాపు ఖరారైంది. హామిల్టన్ 2008, 2014, 2015, 2017, 2018, 2019, 2020లలో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచాడు. 2021లో సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి తర్వాత హామిల్టన్ మరో రేసులో విజేతగా నిలువలేకపోయాడు.

సెమీస్‌లో వైదేహి-రష్మిక జోడీ



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మిక డబుల్స్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఇండోర్‌లో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో రష్మిక-వైదేహి (భారత్) జోడీ 6-2, 6-1తో మూడో సీడ్ కరోల్ మొనెట్ (ఫ్రాన్స్)-యపీనా (రష్యా) జంటపై నెగ్గింది. 52 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక ద్వయం ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.

క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ద్వయం 21-15, 24-22తో భారత్‌కే చెందిన అశ్విని పొనప్ప-తనీషా క్రాస్టో జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మిథున్ 21-9, 13-21, 21-17తో కిడాంబి శ్రీకాంత్‌ను బోల్తా కొట్టించి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో అష్మిత 21-12, 15-21, 21-17తో యు పో పాయ్ (చైనీస్ తైపీ)పై నెగ్గగా... మాళవిక 22-24, 7-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది.

భారత్‌తో డేవిస్‌కప్ మ్యాచ్‌పై పాకిస్తాన్‌లో అనాసక్తి



ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్‌ల మధ్య మైదానంలో పోటీ అంటేనే ఓ సమరాన్ని తలపిస్తుంది. పెద్ద హడావుడి, హంగు, ఆర్భాటం అంతా కనిపిస్తుంది. అయితే ఇదంతా క్రికెట్‌కే పరిమితం. టెన్నిస్ అంటే ఆసక్తి అంతంతమాత్రమే! ఇప్పుడు కూడా ఆరు దశాబ్దాల తర్వాత ఇరు జట్ల మధ్య పాక్ గడ్డపై ప్రతిష్టాత్మక డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్-1 పోటీలు జరగాల్సి ఉంటే... దేశంలో, రాష్ట్రంలో కాదుకదా... కనీసం వేదికైన ఇస్లామాబాద్‌లో కూడా చడీచప్పుడు లేనేలేదు. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కేవలం మీడియా, పాకిస్తాన్ టెన్నిస్ సమాఖ్య (పీటీఎఫ్) నిర్వాహకులు తప్ప ఇంకెవరి అడుగులు, చూపులు అటువైపు పడటం లేదు. మ్యాచ్‌ల కోసం పాస్‌లు, వీవీపీ పాస్‌లు కావాలనే ప్రతిపాదనలు కూడా రావట్లేదు. రేపు, ఎల్లుండి డేవిస్ కప్ మ్యాచ్ ఆడేందుకు పాకిస్తాన్‌కు వచ్చిన భారత టెన్నిస్ జట్టు సభ్యులకు అక్కడి భారత హైకమిషనర్ గీతిక శ్రీవాస్తవ విందు ఏర్పాటు చేసి ఆటగాళ్లకు బెస్టాఫ్ లక్ చెప్పారు.

మన గెలుపు హోరు వినిపించేనా!

విశాఖపట్నంలో నేటి నుంచి రెండో టెస్టు

సమరానికి సిద్ధమైన భారత్, ఇంగ్లండ్	తీవ్ర ఒత్తిడిలో టీమిండియా	ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్ 18లో ప్రత్యక్ష ప్రసారం

కోహ్లి లేడు... కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా దూరమయ్యారు. గిల్, శ్రేయస్ బ్యాటింగ్‌లో తడబాటు కనిపిస్తోంది. తొలి టెస్టులో అనూహ్య ఓటమి జట్టు ఆత్మవిశ్వాసాన్ని కాస్త దెబ్బ తీసిన పరిస్థితి. స్పిన్ మన బలం అనుకుంటే గత మ్యాచ్‌లో అరంగేట్ర స్పిన్నర్‌కే ఆటను అర్పించేశాం. ప్రత్యర్థిని చూస్తే దేనికైనా సిద్ధం అన్నట్లుగా దూకుడుతో 'సై' అంటోంది. రెండో టెస్టుకు ముందు భారత్ పరిస్థితి ఇది. ఇలాంటి సమయంలో విశాఖ తీరాన మన జట్టు తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. 'బజ్‌బాల్'కు చెక్ పెట్టి 'భారత్ బాల్'తో సత్తా చాటాల్సి ఉంది.

2016లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో ఇంగ్లండ్ ఆధిక్యం ప్రదర్శించగా మ్యాచ్ 'డ్రా' అయింది. తర్వాతి నాలుగు టెస్టులు గెలిచి భారత్ చివరకు సిరీస్‌ను 4-0తో గెలుచుకుంది. 2021లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... తొలి టెస్టులో భారత్ ఓటమి. తర్వాతి మూడు టెస్టులు గెలిచి భారత్ 3-1తో సిరీస్ సొంతం చేసుకుంది. ఇప్పుడు 2024లో భారత్‌లో ఇంగ్లండ్ సిరీస్... భారత్ తొలి టెస్టు మ్యాచ్‌లో ఓడిపోయింది. గత రెండు సిరీస్‌ల తరహాలోనే టీమిండియా ఈసారీ కోలుకొని తగిన రీతిలో సమాధానమిస్తూ ముందంజ వేస్తుందా!

సాక్షి, విశాఖపట్నం: ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో 0-1తో వెనుకబడిన భారత జట్టు పోరును సమం చేసే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. హైదరాబాద్‌లో తొలి మ్యాచ్‌లో ఓడిన టీమిండియా రోహిత్ శర్మ నేతృత్వంలో ప్రతీకారానికి సిద్ధమైంది. మరోవైపు తమ జోరును కొనసాగిస్తూ సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని స్టోక్స్ బృందం పట్టుదలగా ఉంది. ఈ నేపథ్యంలో వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో నేటి నుంచి జరిగే రెండో టెస్టు మ్యాచ్‌లో ఇరు జట్లు తలపడనున్నాయి. గత మ్యాచ్‌తో పోలిస్తే ఇరు జట్లలోనూ మార్పులు ఖాయమయ్యాయి.

పటీదార్ అరంగేట్రం!

తొలి టెస్టు ఓటమి తర్వాతి ఇప్పుడు రెండో టెస్టుకు తుది జట్టు ఎంపిక కూడా భారత్ టీమ్ మేనేజ్‌మెంట్‌కు పరీక్ష పెడుతోంది. గాయాలతో దూరమైన రాహుల్, జడేజా స్థానాల్లో రెండు మార్పులు తప్పనిసరి. రాహుల్ స్థానంలో ఒక బ్యాటర్ స్థానం కోసం రజత్ పటీదార్, సర్ఫరాజ్ ఖాన్ పోటీ పడుతున్నారు. గురువారం టీమ్ ప్రాక్టీస్, ఇతర అంశాలను బట్టి చూస్తే రజత్ వైపే ఎక్కువగా మొగ్గు ఉంది. భారత్ తరఫున పటీదార్ ఒకే ఒక వన్డే ఆడాడు. అశ్విన్, అక్షర్ మళ్లీ కీలకం కానుండగా జడేజా స్థానంలో మరో మాటకు తావు లేకుండా కుల్దీప్ మైదానంలోకి దిగుతాడు. అయితే కుల్దీప్ వస్తే బ్యాటింగ్ బలహీనంగా మారిపోతుంది. ఇలాంటి స్థితిలో ఇంగ్లండ్ తరహాలో ఒకే ఒక పేసర్‌ను ఆడించి బ్యాటింగ్ విభాగాన్ని పటిష్టం చేసుకోవడం అవసరం. అలా చేస్తే సిరాజ్ స్థానంలో సర్ఫరాజ్ అరంగేట్రం చేయవచ్చు. అయితే వీటన్నింటికంటే టాప్-4 బ్యాటింగ్ కీలకం కానుంది. ఓపెనర్లు రోహిత్, యశస్వి కాస్త ఓపిగ్గా ఆడితే భారీ స్కోరుకు కావాల్సిన శుభారంభం లభిస్తుంది. గిల్, అయ్యర్ ఇప్పటికైనా తమకు లభిస్తున్న వరుస అవకాశాలకు న్యాయం చేయాల్సి ఉంది.



హార్ట్‌లీ, స్టోక్స్

పిచ్, వాతావరణం

మంచి బ్యాటింగ్ వికెట్. కాస్త బౌన్స్‌తో పాటు మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ జరిగిన రెండు టెస్టుల్లోనూ భారీ స్కోర్లు నమోదు చేసిన భారత్ రెండు మ్యాచ్‌లూ (ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలపై) గెలుచుకుంది. వర్ష సూచన లేదు.

తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ (కెప్టెన్), యశస్వి, గిల్, శ్రేయస్, పటీదార్, భరత్, అశ్విన్, అక్షర్, బుమ్రా, సిరాజ్, కుల్దీప్. ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్‌లీ, రేహన్, బషీర్, అండర్సన్.

అండర్సన్@184



41 ఏళ్లు దాటిన పేసర్ అండర్సన్ తన కెరీర్‌లో 184వ టెస్టులో బరిలోకి దిగుతున్నాడు. అతనికి ఇది అంతర్జాతీయ క్రికెట్‌లో 22వ ఏడాది కానుండడం విశేషం. తను అరంగేట్రం చేసినప్పుడు ఇంకా పుట్టని రేహాన్, బషీర్‌లతో కలిసి అండర్సన్ బౌలింగ్ చేయబోతున్నాడు.



ఆంధ్ర క్రికెటర్ కోన శ్రీకర్ భరత్ తొలిసారి తన సొంత గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. వైజాగ్‌కే చెందిన వికెట్‌కీపర్ భరత్‌కు 6 టెస్టుల స్వల్ప కెరీర్ తర్వాతే ఈ అవకాశం దక్కడం విశేషం. ఈ టెస్టులో జట్టు అవకాశాల గురించి భరత్ మాట్లాడుతూ... 'అన్ని ప్రణాళికలతో మేము సిద్ధంగా ఉన్నాం. తొలి టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన తప్పులపై చర్చించాం. స్వీప్ షాట్‌లపై సాధన చేశాం. మేం అలాంటి షాట్లన్నీ ఆడగలం. అయితే పరిస్థితిని బట్టే బ్యాటర్లు దానిని అమలు చేస్తారు. గత ఓటమి తర్వాత మేమేం ఆందోళనకు గురి కాలేదు. జట్టులో అంతా బాగుంది. సుదీర్ఘ సిరీస్ కాబట్టి కోలుకునే అవకాశం ఉందని మాకు తెలుసు' అని అన్నాడు.

బరిలోకి బషీర్...

ఇంగ్లండ్ తమ తుది జట్టును గురువారమే ప్రకటించింది. గాయపడ్డ స్పిన్నర్ జాక్ లీచ్ స్థానంలో ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లోకి అడుగు పెడుతున్నాడు. గత మ్యాచ్‌లో భారత్‌ను దెబ్బ కొట్టిన హార్ట్‌లీ మళ్లీ చెలరేగేందుకు సిద్ధంగా ఉండగా... అన్నింటికి మించి ఏకైక పేసర్ గా సీనియర్ బౌలర్ అండర్సన్ పునరాగమనం చేస్తుండటం విశేషం. వుడ్ స్థానంలో అతడిని ఇంగ్లండ్ ఎంపిక చేసింది. తొలి టెస్టులో ఎప్పటిలాగే తమ దూకుడైన బ్యాటింగే ఇంగ్లండ్‌ను గెలిపించింది. ఓపెనర్లు క్రాలీ, డకెట్ ధాటిగా ఆడుతుండగా పోప్ ఆట ఎలాంటిదో గత మ్యాచ్ చూపించింది. స్టార్ బ్యాటర్ రూట్ అటు బౌలింగ్‌లోనూ ప్రధానపాత్ర పోషించడం జట్టు బలాన్ని పెంచింది. అటు బ్యాటింగ్‌తో, ఇటు కెప్టెన్సీతో స్టోక్స్ విలువైన ఆటగాడు. ఇంగ్లండ్ ముగ్గురు స్పిన్నర్లు ఈసారి భారత్‌ను ఎలా నిలువరిస్తారనేది ఆసక్తికరం.



రోహిత్

బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442 కోట్లు

గతేడాది కంటే రూ.45.36 కోట్లు ఎక్కువ

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో క్రీడల కోసం రూ. 3,442.32 కోట్లు కేటాయించారు. 2023-24 వార్షిక బడ్జెట్‌లో రూ. 3,396.96 కోట్లు క్రీడలకు వెచ్చిస్తే ఈసారి రూ.45.36 కోట్లు పెంచారు. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమం కోసం రూ. 900 కోట్లు (రూ.20 కోట్లు పెరుగుదల), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు రూ. 822.60 కోట్లు (రూ.26.83 కోట్లు పెంపు) కేటాయించారు. మౌలిక వసతుల కల్పన, అథ్లెట్లకు అధునిక క్రీడా సామాగ్రి, కోచ్‌ల నియామకం కోసం ఆ మొత్తాన్ని వినియోగిస్తారు. జాతీయ క్రీడా సమాఖ్యలకు రూ 340 కోట్లు (రూ.15 కోట్లు పెంచారు) ఇవ్వనున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) బలోపేతానికి రూ. 22.30 కోట్లు కేటాయించారు. నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి రూ. 91.90 కోట్లు (రూ.8.69 కోట్లు హెచ్చింపు) కేటాయించారు.

ప్రొ కబడ్డీ లీగ్ ప్లే ఆఫ్స్, ఫైనల్‌కు హైదరాబాద్ ఆతిథ్యం



బెంగళూరు: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) పదో సీజన్ ప్లే ఆఫ్స్, ఫైనల్ మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1 వరకు ఈ పోటీలు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుగుతాయని పీకేఎల్ నిర్వాహకులైన మషాల్ స్పోర్ట్స్ తెలిపింది. మొత్తం 12 జట్లు పోటీ పడుతున్న ప్రొ కబడ్డీ లీగ్‌లో పాయింట్ల పట్టికలో టాప్-6లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. టాప్-2 జట్లకు నేరుగా సెమీఫైనల్ బెర్త్‌లు లభిస్తాయి. మిగతా నాలుగు జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఫిబ్రవరి 26న ఎలిమినేటర్-1లో ఆరో స్థానం పొందిన జట్టుతో మూడో స్థానంలో నిలిచిన జట్టు... ఎలిమినేటర్-2లో ఐదో స్థానంలో నిలిచిన జట్టుతో నాలుగో స్థానం పొందిన జట్టు ఆడతాయి. ఫిబ్రవరి 28న ఎలిమినేటర్-1 విజేత తొలి సెమీఫైనల్లో లీగ్ 'టాపర్'తో... ఎలిమినేటర్-2 విజేత లీగ్‌లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో పోటీపడతాయి. ఫైనల్ మార్చి 1న జరుగుతుంది.

సినిమా

గెటింగ్ రెడీ



● చిరంజీవి

'విశ్వంభర' సినిమా షూటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నారు హీరో చిరంజీవి. ఈ చిత్రంలో భీమవరం దొరబాబు పాత్రలో చిరంజీవి నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. కాగా ఈ పాత్రకు సంబంధించిన మేకోవర్ కోసం చిరంజీవి కసరత్తులు చేస్తున్నారు. 'గెటింగ్ రెడీ ఫర్ విశ్వంభర' అంటూ తన వర్కౌట్స్ వీడియోను షేర్ చేశారు చిరంజీవి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ ఈ సినిమాకు దర్శకుడు. ఆల్రెడీ చిత్రీకరణ మొదలైంది. అయితే ముందు చిరంజీవి పాల్గొనని సన్నివేశాలను చిత్రీకరించారు. హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన సెట్స్‌లో ఈ నెల నుంచి 'విశ్వంభర' షూటింగ్‌లో చిరంజీవి పాల్గొంటారని తెలిసింది. ఇక ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. భారీ బడ్జెట్‌తో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి, కెమెరా: చోటా కే నాయుడు.

చలో రష్యా



● కమల్‌హాసన్

కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' రష్యాలో ఆరంభం కానుందట. 1987లో వచ్చిన 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్-దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'. 'జయం' రవి, దుల్కర్ సల్మాన్, త్రిష, గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, ఐశ్వర్యా లక్ష్మీ ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో రంగరాయ శక్తివేల్ నాయకర్ పాత్రలో నటిస్తున్నారు కమల్‌హాసన్. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ప్రారంభమైంది. కమల్‌హాసన్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. కాగా ఈ సినిమా నెక్స్ట్ షెడ్యూల్ చిత్రీకరణను రష్యాలో ప్లాన్ చేశారట మణిరత్నం. ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని కోలీవుడ్ సమాచారం. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.

మహేశ్ సినిమాలో?



● నాగార్జున

సూపర్ స్టార్ మహేశ్‌బాబు-కింగ్ నాగార్జున స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాలు అంటున్నాయి. ఇంతకీ ఈ కాంబినేషన్ ఏ సినిమాకీ? అంటే.. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా రూపొందనున్న చిత్రానికి అంటున్నారు. 'గుంటూరు కారం' సినిమా హిట్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న మహేశ్‌బాబు తన తర్వాతి చిత్రాన్ని ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో చేయనున్న సంగతి తెలిసిందే. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ మూవీగా 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనుంది. ఈ చిత్రానికి రచయిత విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. ఇటీవలే స్క్రిప్ట్ వర్క్ పూర్తయిన ఈ ప్రాజెక్టు కోసం నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట రాజమౌళి. ఈ సినిమాలో సౌత్ ఇండస్ట్రీకి చెందిన పలువురు స్టార్స్ కీలక పాత్రల్లో నటించనున్నారని తెలిసింది. ఇందులో భాగంగానే నాగార్జున కూడా కీలక పాత్రలో నటించనున్నారని టాక్. సినిమాలో చాలా ప్రాధాన్యం ఉన్న ఓ పాత్రకి నాగార్జునని తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నారట రాజమౌళి. నాగార్జునకి దక్షిణాదితో పాటు ప్రత్యేకించి బాలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు ఉంది. అందుకే జాతీయ స్థాయిలో పేరున్న నాగార్జునను 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' కోసం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భోగట్టా. ఏప్రిల్‌లో ఈ సినిమా ప్రారంభం కానుంది. మరి మహేశ్‌బాబు-నాగార్జున కాంబో తెరపై కనిపిస్తుందా? అంటే ఇప్పటికైతే సమాధానం లేని ప్రశ్న.

వేసవిలో మ్యాచ్



● సిద్ధార్థ్, నయనతార, మాధవన్

'ది టెస్ట్'ను పూర్తి చేశారు నయనతార. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో నయనతారతో పాటు మాధవన్, సిద్ధార్థ్ లీడ్ రోల్స్ చేశారు. మీరా జాస్మిన్ ఓ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాతో నిర్మాత శశికాంత్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సింగర్ శక్తిశ్రీగోపాలన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు, ఈ వేసవిలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కాగా ఈ సినిమాను గత ఏడాది నవంబరులో విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు వేసవికి వాయిదా వేశారు. తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

సరికొత్త కథతో శ్రీకారం



● అమర్‌దీప్, సుప్రీత

'బిగ్ బాస్' ఫేమ్ అమర్‌దీప్ చౌదరి హీరోగా, నటి సురేఖా వాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా కొత్త చిత్రానికి శ్రీకారం జరిగింది. ఈ చిత్రానికి మాల్యాద్రి రెడ్డి దర్శకుడు. మహర్షి కూండ్ల సమర్పణలో ఎం3 మీడియా బ్యానర్‌పై మహా మూవీస్‌తో కలిసి మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్న ఈ సినిమా గురువారం ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ఏఎం రత్నం కెమెరా స్విచ్చాన్ చేయగా, బసిరెడ్డి క్లాప్ కొట్టగా, వీర శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ– ''ఇండియన్ సినిమాలో ఇంతవరకూ ఎవరూ టచ్ చేయని కొత్త కథతో ఈ సినిమాని రూపొందిస్తున్నాం'' అన్నారు. ''మాలాంటి కొత్త వాళ్లకి ఎం3 మీడియా చాన్స్ ఇవ్వడం హ్యాపీగా ఉంది'' అన్నారు మాల్యాద్రి రెడ్డి. ''బిగ్ బాస్'కి వెళ్లకముందే ఈ సినిమా ఒప్పుకున్నాను'' అన్నారు అమర్‌దీప్ చౌదరి. సుప్రీత, నటీనటులు సురేఖా వాణి, తేజస్వి, గౌతమ్ కృష్ణ, రఘు, నటుడు, దర్శకుడు తల్లాడ సాయికృష్ణ మాట్లాడారు. ఈ చిత్రానికి సంగీతం: దాస్ కడియాల, కెమెరా: బాల సరస్వతి.

తెలుగు, నేపాలీ భాషల్లో...



● బ్రహ్మానందం

ప్రముఖ నటుడు బ్రహ్మానందం కీలక పాత్ర పోషిస్తున్న తొలి తెలుగు, నేపాలీ చిత్రం 'హ్రస్వ దీర్ఘ'. చంద్ర పంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హరిహర్ అధికారి, నీతా దుంగన లీడ్ రోల్స్ చేస్తున్నారు. నీతా ఫిలిమ్స్ ప్రొడక్షన్స్‌పై నీతా దుంగన ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఫిబ్రవరి 1న బ్రహ్మానందం పుట్టినరోజు. ఈ సందర్భంగా 'హ్రస్వదీర్ఘ'లోని ఆయన పాత్రకి సంబంధించిన ఫస్ట్ లుక్‌ని విడుదల చేయడంతో పాటు ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 27న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

పల్లెటూరి ప్రేమకథ



● శ్రీకాంత్, వినాయక్ దేశాయ్

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన చిత్రం 'రాధా మాధవం'. గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''రాధా మాధవం' ట్రైలర్ చూస్తే అందమైన ప్రేమకథా చిత్రమని తెలుస్తోంది. ట్రైలర్ చాలా బాగుంది.. సినిమా పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. ''అందమైన పల్లెటూరి ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. మా సినిమా సెన్సార్ పనులు జరుపుకుంటోంది'' అన్నారు దాసరి ఇస్సాకు. ''ఈ నెలలోనే మా సినిమా రిలీజ్ అవుతుంది.. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గోనాల్ వెంకటేశ్. ''పల్లెటూరి నేపథ్యంలో సాగే ప్రేమకథతో సహజత్వం ఉట్టి పడేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దాసరి ఇస్సాకు. మా చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసిన శ్రీకాంత్‌గారికి థ్యాంక్స్'' అన్నారు వినాయక్ దేశాయ్.

విన్నర్‌గా ఎలా మారాడు?



● గీతానంద్

''గేమ్ ఆన్' యునిక్ స్టోరీ. రెగ్యులర్‌గా కాకుండా వైవిధ్యంగా చేయాలని ప్రయత్నించాం. ఈ చిత్రంలో హీరో లూజర్ నుంచి విన్నర్‌గా ఎలా మారాడు? అనేది ఆసక్తిగా ఉంటుంది. ఇందులో భాగంగా ఉండే టాస్కులు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని గీతానంద్ అన్నారు. దయానంద్ దర్శకత్వంలో గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. రవి కస్తూరి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా హీరో గీతానంద్ మాట్లాడుతూ– ''దయానంద్ నా తమ్ముడు కావడంతో 'గేమ్ ఆన్' స్క్రిప్ట్ విషయంలో బాగా చర్చించుకునే వాళ్లం. రవి కస్తూరి కూడా నా ఫ్రెండ్ కావడంతో ముగ్గురం చర్చించుకుని నిర్ణయాలు తీసుకునేవాళ్లం. ఈ మూవీకి సీక్వెల్ ప్లాన్ ఉంది'' అన్నారు.

మ్యూజిక్ కూడా కథ చెబుతుంది

– దేవ్ జాంద్



రవితేజ హీరోగా నటించిన చిత్రం 'ఈగల్'. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ దేవ్ జాంద్ మాట్లాడుతూ– ''నా పదో తరగతి నుంచే మ్యూజిక్ జర్నీ స్టార్ట్ చేశాను. పియానో, గిటార్, డ్రమ్స్, ప్రోగ్రామింగ్ నేర్చుకున్నాను. కొన్ని వీడియో గేమ్స్‌కి మ్యూజిక్ ఇచ్చాను. సంగీత దర్శకుడిగా 'ఈగల్' నాకు తొలి చిత్రం. కాలేజీలో నేను, హీరో శ్రీవిష్ణు క్లాస్‌మేట్స్. అలా కార్తీక్ నాకు పరిచయం అయ్యాడు. ఇప్పుడు తనతో నా జర్నీ మొదలైంది. రవితేజగారితో సినిమా ఫిక్స్ అయ్యాక ఆయన ఓకే చెబితే, మ్యూజిక్ డైరెక్టర్‌గా నాకు చాన్స్ ఇస్తానన్నాడు కార్తీక్. రవితేజగారు నా మ్యూజిక్ ట్రాక్స్ విని, నచ్చి ఓకే చేశారు. రవితేజగారి సినిమాకు మ్యూజిక్ చేయడం నా లక్. ఈ సినిమాలో మ్యూజిక్, ఆర్ఆర్‌లకు మంచి స్కోప్ ఉంది. మ్యూజిక్ కూడా కథ చెబుతున్నట్లుగా ఉంటుంది. ఈ సినిమాలో నాలుగు పాటలు ఉన్నాయి. ఇక కార్తీక్ దర్శకత్వంలోనే తేజ సజ్జా హీరోగా చేస్తున్న ఓ సినిమాకు, దర్శకుడు నక్కిన త్రినాథరావుగారి ప్రొడక్షన్‌లోని ఓ మూవీకి మ్యూజిక్ ఇస్తున్నాను. మరో రెండు ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.